ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 9 ఏప్రిల్ 2025



మహిళ మృతి ఘటనపై విచారణ..

జగిత్యాలఅర్బన్, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని అరున హాస్పిటల్‌లో మహిళ మృతి చెందిన ఘటనపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, ఉప వైద్యాధికారి శ్రీనివాస్, మాత శిశు ప్రోగాం అధికారి జైపాల్‌రెడ్డిలు మంగళవారం విచారణ జరిపారు. గర్భ సంచి ఆపరేషన్ కోసం ఆసుపత్రిలో చేర్చగా సర్జరీ చేసిన తర్వాత మృతి చెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపినట్లు వైద్యాధికారులు తెలిపారు. అనంతరం సర్జరీ చేసిన వైద్యులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ తెలియజేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతున్నారు. మంగళవారం మండలంలోని సర్వరాజ్‌పూర్ గ్రామంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డితో కలిసి ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పీటీసీ సభ్యుడు తోట గంగాధర్, నాయకులు మహిపాల్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, కొంతం పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన రాచర్ల ప్రకాష్ సోమవారం మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, నాయకులు రాజేశం, స్వామి, లక్ష్మారెడ్డి ఉన్నారు.

ఎస్సారెస్పీ నీటి విడుదల నిలిపివేత

- నేటితో యాసంగి సాగుకు విడుదల పూర్తి
- చేతికి అందని పంటలు
- మరో తడికి నీరు ఇవ్వాలని రైతుల వినతి
- సాధ్యం కాదంటున్న అధికారులు
- వేసవిలో తాగునీటి అవసరాలకు నిల్వ


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన శ్రీరాంసాగర్ కింద సాగు అవసరాలకు నీటి విడుదల ప్రక్రియ ముగిసింది. మిగిలిన నీటిని తాగునీటి అవసరాలకు పక్కన బెట్టారు. ఆయకట్టుకు నీటి విడుదల ప్రణాళిక ముగిసినప్పటికీ కాకతీయ కాలువ నీటి ఆధారంగా సాగవుతున్న వరి పంటలు మాత్రం ఇంకా పూర్తి స్థాయిలో కోతకు రాలేదు. కనీసం మరోవారం రోజుల పాటు మరోతడి నీరందిస్తే పంటలు చేతికందుతాయని ఆయకట్టు రైతులు అంటున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 12.904 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కానీ అందులో 5 టీఎంసీల డెడ్ స్టోరేజీ, 5 టీఎంసీలు తాగునీటి అవసరాలకు పోతుంది. ఆవిరి రూపంలో 2 టీఎంసీల నీరు పోతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రాజెక్టులో 12టీఎంసీల నీరు కచ్చితంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు భావిస్తున్నారు. దీంతో కాకతీయ కాలువ ద్వారా మరో తడి ఇచ్చే అవకాశం లేదని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. నీటి సరఫరా లేకపోతే పంటలు ఎండిపోతాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● గత యేడాది డిసెంబరు 25 నుంచి నీటి విడుదల

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గత యేడాది డిసెంబరు 25వ తేదీ నుంచి నీటి విడుదలను చేపట్టారు. ఈనెల 9వ తేదీతో వారబందీ పద్ధతిలో నీటి సరఫరా పూర్తవుతుంది. వారబందీ ప్రకారం వారం రోజులు 3,500 క్యూసెక్కులు, ఎనిమిది రోజులు 7,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. యాసంగి సీజన్‌కు సంబంధించి నీటి విడుదల ప్రారంభమైన సమయంలో ప్రాజెక్టులో 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 12.904 టీఎంసీలకు పడిపోయింది. ప్రస్తుత సీజన్‌లో ఎల్లంపల్లి నుంచి వరద కాలువలోకి నీటిని ఎత్తిపోయనందున ఎస్సారెస్పీ నీటినే వరద కాలువలోకి వదలడం, స్టేజ్-2 ఆయకట్టుకు కొంత నీటిని తరలించడంతో ప్రస్తుతం డ్యామ్‌లో నీటి నిల్వలు అడుగంటాయి. మరోవైపు ఎండల తీవ్రత పెరగడం, భూగర్భ జలాలు తగ్గడంతో పంటలకు నీరు అందడం కష్టంగా మారుతోంది. యాసంగి సీజన్‌లో వరద కాలువకు శ్రీరాంసాగర్ నీటిని అధికారులు విడుదల చేశారు. కాగా వరి పొలాలు, నువ్వు తదితర పంటలు, మామిడి తోటలకు నీటి తడులు సరిగా అందక రైతులు ఇక్కట్ల పాలయ్యారు. ప్రస్తుతం మరో తడికి నీరు అందకపోతే ఇక్కట్లు ఏర్పడుతాయని రైతులు వాపోతున్నారు.

● ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వ..

ఎస్సారెస్పీలో నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 12.904 టీఎంసీల నీరు నిల్వఉంది. గతయేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 9.715 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగునీటి కాలువలకు కలిపి ప్రాజెక్టు నుంచి 5,797క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 250 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి231 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 231 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 700క్యూసెక్కులు, నిజామాబాద్, నిర్మల్ టీఎస్‌ఐడీసీకి 312 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231క్యూసెక్కులు విడుదల అవుతుండగా 341 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా గత యేడాది జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 288.037 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 282.742 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వినియోగించారు.

● జూలై దాకా తాగునీటికి ఢోకా లేనట్టే..

ఎస్సారెస్పీలో ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిని జూలై వరకు తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు. ఆగస్టు నుంచి సహజ ప్రవాహాలు మొదలయ్యే వరకు ఈ నీటిని సర్దుబాటు చేయనున్నారు. మిషన్ భగీరథతో పాటు స్థానిక తాగునీటి అవసరాలకు ఈ నీటిని పక్కకు పెట్టాలన్న నిర్ణయం మేరకు నీటి నిల్వలు లభ్యతగా ఉంచారు. ఒకవేళ ఆ తదుపరి సహజ ప్రవాహాలు కరువైనా పరిస్థితిని ఎదుర్కొనేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్..

మిగతా 8లో

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

● అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అధికారులకు సూచించారు. మంగళవారం ధరూర్ గ్రామంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకొని ఫీజులు చెల్లించినవారి యజమానుల భూములను క్షేత్రస్థాయిలో విచారిస్తున్న ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంమోహన్, ఎంపీడీవో విజయలక్ష్మీ, ఎంపీవోవాసవి, పంచాయతీకార్యదర్శి అజయ్ పాల్గొన్నారు.

ఆరోగ్య మందిర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి


హెల్త్ సెంటర్ భవనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

రాయికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం అయోధ్య గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సబ్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్ అన్నారు. మంగళవారం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం అధికారి ఆకుల శ్రీనివాస్, వైద్యాధికారి సతీష్ కుమార్, ఎన్‌హెచ్ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి రవీందర్ ఉన్నారు.

'బీజేపీపై కాంగ్రెస్ చౌకబారు విమర్శలు'

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బీజేపీపై కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌకబారు విమర్శలు మానుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం సూచించారు. ప్రధాని మోదీపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితం అన్నారు. పదేళ్ల అధికారానికి దూరం కాగానే ఆరు గ్యారంటీలనే అబద్దాలతో ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. వాటిని అమలు చేయాలని ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై తప్పుడు కేసులను బనాయిస్తోందని ఆయన ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ ఏనాడూ అధికారం కోసం అడ్డదారులు తొక్కలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను తప్పకుండా అమలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారం వల్లనే రాష్ట్రానికి ఏడాదికి 50వేల కోట్ల నిధులు వచ్చిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు.

'పెన్షన్ సవరణ బిల్లు రద్దు చేయాలి'

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 08 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ సవరణ రద్దు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీకి తెలంగాణ పెన్షన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. మంగళవారం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్ర కార్యాలయంలో జిల్లాలోని ఆయా మండలాల ప్రతినిధులు సమావేశమై ప్రధానికి లేఖ రాసి పోస్టు డబ్బాల్లో వేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు బొల్లం విజయ్, పిసి హన్మంత్ రెడ్డి, వెల్ముల ప్రకాశ్ రావు, గౌరిశెట్టి విశ్వనాథం, పూసల అశోక్, భీమయ్య , కరుణ, విజయ తదితరులు పాల్గొన్నారు,

రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి

● కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్


రోడ్డును ప్రారంభిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

కొడిమ్యాల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేద్దామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శివాజీ విగ్రహం నుంచి అంగడి బజారు వరకు 65లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డును చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుదాం అన్నారు. అంతకుముందు చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పరస్పర సహకారంతో అభివృద్ధి చేయటం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కేంద్రమంత్రి చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాముల వుతున్నారన్నారు. చొప్పదండి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దటానికి తామంతా కంకణం కట్టుకున్నామన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్, శివాజీ, వివేకానంద విగ్రహాలకు పూల మాలలు వేశారు. అంతక ముందు బీజేపీ కార్యకర్తలు కేంద్ర మంత్రిని పూడూర్ నుండి బైక్ ర్యాలీతో కొడిమ్యాల బస్టాండ్ వరకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే శోభ, చొప్పదండి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మహేష్, మల్యాల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బండ నర్సింహారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, కొడిమ్యాల మాజీ సర్పంచు ఏలేటి మమతనర్సింహారెడ్డి, బీజేపీ నాయకులు, మాజీఉపాధ్యక్షుడు రాజేశం, మాజీ ఉప సర్పంచు లింగారెడ్డి, బుచ్చిరాములు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, భూమేష్, చిరంజీవి, కొడిమ్యాల పూడూర్ సింగిల్ విండోల చైర్మనులు తదితరులు పాల్గొన్నారు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

●ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్


గంగాపూర్‌లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న విప్ అడ్లూరి

బుగ్గారం ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గంగాపూర్ గ్రామంలో రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం గంగాపూర్ గ్రామంలోని సామాన్య కుటుంబానికి చెందిన రెంటం మల్లయ్య నివాసంలో సన్నబియ్యంతో వండిన భోజనాన్ని చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ మాట్లాడుతూ పేదలు సన్న బియ్యం తినాలనే సంకల్పంతో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుందని అన్నారు. గంగాపూర్ గ్రామానికి వారంలోపు బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. బుగ్గారం నుంచి గంగాపూర్ వరకు బీటి రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. గ్యాస్ సబ్సిడీ రానివారు స్థానిక తహసీల్దారు మాజీద్‌కు వివరాలను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాజీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల సుభాష్, యూత్ అధ్యక్షులు సికిరీ అంజిత్, నాయకులు రెంటం శ్రీధర్, తాండ్ర సత్యనారాయణ రావు, పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** వెల్గటూర్‌లో రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం, 24 మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను విప్ లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, డీటీ గంగాధర్, ఆర్ఐ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ తిరుపతి, నాయకులు మెరుగు మురళి, బందెల ఉదయ్, సందీప్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, పూదదరి రమేష్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల పేర్లు మారుస్తూ గెజిట్ విడుదల

గొల్లపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంనగర్, తిర్మలాపూర్ (ఎం) గ్రామాల పేర్లు మార్చుతూ గెజిట్ విడుదలైంది. ఇబ్రహీంనగర్ పేరును శ్రీరాములపల్లిగా, తిర్మలాపూర్ (ఎం) పేరును మల్లన్నపేట గ్రామాలుగా అధికారికంగా మార్చుతూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ జీవో జారీ చేశారు. ఇకపై అన్ని రికార్డుల్లో శ్రీరాములపల్లె, మల్లన్నపేటగా పేర్కొనాలని గెజిట్‌లో పేర్కొన్నారు. పేర్ల మార్పులో ప్రత్యేక చొరవ చూపిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తాగునీరు సమస్య తలెత్తకుండా కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ లతతో కలిసి నియోజవర్గంలోని వివిధశాఖల అధికారులు, మిషన్ భగరథ డీఈ, ఏఈలతో తాగు నీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ పరిదిలతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో తాగు నీటి సరఫరా విషయాలను సంబంధిత అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, అదనపు కలెక్టర్ లత అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు నీటి సమస్యలు రాలేదన్నారు. ఇప్పుడు కూడా అదే విధంగా చర్యలు తీసుకొని నీటి సరఫరా చేయాలని అన్నారు. మున్సిపల్ పరిధిలలోని వార్డులలో ఎక్కువ సమస్యఉన్న వార్డులను గుర్తించి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మోహన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కోరుట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న హనుమాన్ దీక్షాపరులు

వైభవంగా వీర హనుమాన్ విజయోత్సవ ర్యాలీ

8

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

మల్యాల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చునని అంగన్‌వాడీలు సూచించారు. పోషణ పక్షం కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని రామన్నపేట, మద్దుట్ల, మల్యాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శారద, టీచర్లు రేణుక, స్వరూపరాణీ, అనురాధ, జలజ, కళావతి పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

కథలాపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పోషక విలువలు గల అహారం అందిస్తేనే చిన్నారుల్లో ఎదుగుదల ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షైమదీబేగం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మెనలో పోషణ పక్షోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో గర్భిణీలు తీసుకోవాల్సిన అహారం గురించి వివరించారు. గర్భిణీల ఎత్తు, బరువు వంటి కొలతలు వేసి నమోదు చేసుకున్నారు. రెండు సంవత్సరాల లోపు ఉన్న పిల్లల ఆహారంపై పర్యవేక్షణ చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఈ నెల 22 దాకా పక్షోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

● రాయికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావన్‌పెల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు, గర్భిణీలకు, బాలింతలకు, కిశోర బాలికలకు రక్తహీనత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణీలు మిల్లెట్స్ ఆకు కూరలు, పల్లి పట్టీలు రెగ్యులర్‌గా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గీతారాణి, ఏఎన్ఎం లలిత, అంగన్‌వాడీ టీచర్ రోజా, అయమ్మ, అమృత తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పథకంతో పేదలకు లబ్ధి


అంతర్గాంలో లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకంతో పేదలకు లబ్ధి చేకూరుతుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామంలో మంగళవారం సన్నబియ్యం లబ్ధిదారుడు కోల సంజీవ్ ఇంట్లో సన్నబియ్యంతో వండిన ఆహారాన్ని ఎమ్మెల్యే, కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. అనంతరం అంతర్గాం గ్రామంలో ఐకేపీ రబీ యాసంగి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీతో 80శాతం బడుగు, బలహీన వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. దేశంలో ఎక్కడా సన్నబియ్యం పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పేదల పార్టీ అని సన్నబియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సన్నరకం పండించిన రైతులకు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో డీఎస్ జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రమాదేవి, ఏడీఏ తిరుపతినాయక్, ఏపీఎం గంగాధర్, నాయకులు రవీందర్‌రెడ్డి, నారాయణ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

WANTED
★ శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను / పేషంట్స్‌ని / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని / వంట పనిచేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph.: 99120 11499, 99120 11899.
AJH-003142

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

ప్రాణం తీసిన క్రికెట్ బాల్

- చికిత్స పొందుతూ బాలుడి మృతి


అశ్విత్‌రెడ్డి(ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బాల్ తగిలి గాయపడిన సంఘటనలో వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ ప్రాంతానికి చెందిన దారం అశ్విత్‌రెడ్డి(9) అనే బాలుడు మృతిచెందాడు. గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామానికి చెందిన దారం శ్రీనివాస్‌రెడ్డి వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్‌లో మందుల దుకాణం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శ్రీనివాస్‌రెడ్డికి కుమారుడు అశ్విత్‌రెడ్డితో పాటు ఒక కుమార్తె ఉంది. వేసవి సందర్భంగా ఒంటిపూట బడి కొనసాగుతున్న నేపథ్యంలో ఈనెల 3వ తేదీ గురువారం పాఠశాల అయిపోయిన తర్వాత అశ్విత్‌రెడ్డి స్నేహితులతో క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. ఇంటికి తిరిగివచ్చి యథావిధిగా శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. తరగతి గదిలో ఉన్న సమయంలో తలనొప్పిగా ఉందని చెప్పడంతో తండ్రి శ్రీనివాస్‌రెడ్డికి పాఠశాల నిర్వాహకులు సమాచారం అందించారు. అశ్విత్‌రెడ్డిని తండ్రి డాక్టర్ వద్దకు తీసుకువెళ్లగా తలపై క్రికెట్ బాల్ తగిలిందని చెప్పినట్లు సమాచారం. తలలో తీవ్రగాయమై రక్తస్రావం అవుతున్నట్లుగా గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ మేరకు బాలుడు అశ్విత్‌రెడ్డిని కరీంనగర్ తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో శుక్రవారం రాత్రి హైదరాబాద్ బంజారాహిల్స్ అపోలో ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేసినట్లు బంధువులు తెలిపారు. సోమవారం తిరిగి రెండో శస్త్రచికిత్స నిర్వహించగా మంగళవారం బ్రెయిన్‌డెడ్ అయి బాలుడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సరదాగా క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లి బంతి తగిలి గాయపడిన తమ కుమారుడు మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

మోడల్ స్కూల్లో క్రీడా సామగ్రి చోరీ

గంగాధర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మోడల్ స్కూల్లో క్రీడా సామగ్రి చోరీకి గురైనట్లు ఎస్‌ఐ వంశీ క్రిష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 5న పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కెమెరాలను పరిశీలిస్తున్న క్రమంలో ఒక కెమెరా పనిచేయకపోవడంతో అక్కడికి వెళ్లి చూడగా కనిపించలేదు. పక్కనే ఉన్న క్రీడా రూంను పరిశీలించగా క్రికెట్ బ్యాట్లు, వికెట్లు, షటిల్ బ్యాట్లు, గడియారాలు చోరీకి గురైనట్లు తెలిపారు. చోరీకి గురైన క్రీడా వస్తువుల విలువ 15వేలు ఉంటుందని, ప్రిన్సిపాల్ పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మామిడాలపల్లిలో పుస్తెల తాడు..

వీణవంక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన అరవకొండ సరమ్మకు చెందిన 2.5 తులాల పుస్తెలు తాడు గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం సరమ్మ ఇంటి ముందు నిద్రిస్తుండగా తెల్లవారుజామున చూసుకునే సరికి పుస్తెలు తాడు మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించుకొని వెళ్లినట్లు తెలిపారు. సరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

వృద్ధుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తిరుమల్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామానికి చెందిన సముద్రాల కొంరయ్య వృత్తిరీత్యా సుతారి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనంపై తోకలపల్లి గ్రామ శివారులో రోడ్డు దాటుతుండగా ఓ కారు డ్రైవర్ వచ్చి ఢీకొట్టడంతో తలకు, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయ పడిన కొంరయ్యను స్థానికులు ఆటోలో హుజూరాబాద్ ప్రభుత్వా సుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆసుపత్రికి చేరుకొని మెరుగైన చికిత్స కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు కొంరయ్య సోదరుడి కుమారుడు సముద్రాల పవన్‌కల్యాణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

నకిలీ ధ్రువీకరణపత్రాల కేసులో యువకుడి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్య ధ్రువీకరణ పత్రం కేసులో మహమ్మద్ యూసుఫుద్దీన్ (37) అనే యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గాలిపెల్లి పశువైద్యశాలలో ఓఎస్‌గా పనిచేస్తున్న దేవమ్మ మెడికల్ ఇన్వాలిడేషన్ సర్టిఫికెట్ సమర్పించగా జిల్లా అధికారులు విచారణ జరిపి నకిలీపత్రాలు అని తేల్చారు. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా మంగళవారం యూసుఫుద్దీన్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చెరువుల్లో చేపల పెంపకం


సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గై చెరువులో పట్టిన చేపలు

- గ్రామాల్లో ఉపాధి పొందుతున్న మత్స్యకారులు
- ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయాలని వేడుకోలు
- చెరువులు, కుంటల్లో నీటిని నింపితే మరింత ఆదాయం

సైదాపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చేపల పెంపకంతో గ్రామాల్లోని మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు చెరువుల్లో నీరు లేక చేపల పెంపకం ఆశాజనకంగా లేదు. గత కొన్ని సంవత్సరాల నుంచి వర్షాలు సమృద్ధిగా కురవడం, కాలువ ద్వారా నీరు అందుబాటులోకి రావడంతో చెరువుల్లోకి సమృద్ధిగా నీరు చేరుతోంది. దీనికి తోడు ప్రభుత్వం ఉచిత చేప పిల్లలు పంపిణీ చేయడంతో మత్స్యకారులు చెరువులు, కుంటలలో చేప పిల్లలు పోసి ఉపాధి పొందుతున్నారు. గత సంవత్సరం వర్షాలు సంవృద్ధిగా కురియడం వల్ల చెరువులలో నీరు ఎక్కువ కాలం ఉండడంతో చేపలు ఎక్కువ సైజు వరకు పెరిగి ఎక్కువ ఆదాయం వచ్చిందని మత్స్యకారులు చెపుతున్నారు. ఈ సంవత్సరం వర్షాకాలం ప్రారంభంలో కురిషిన వర్షాలు ఇప్పటి వరకు లేక పోవడం, ఆ వర్షాలకు చెరువులు పూర్తిగా నిండక పోవడంతో పాటు కాలువ నీరు కూడా అంతంత మాత్రంగా రావడం తో చెరువులు, కుంటల్లో నీరు అంతంత మాత్రంగా చేరింది. నీరు సమృద్ధిగా లేక చేపలు తక్కువ సైజు పెరిగాయని, సుమారు సగం వరకు ఆదాయం తగ్గిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఉచిత చేపపిల్లలు ఇవ్వక పోవడం కూడా ఆదాయం తగ్గుదలకు కారణమని తెలుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి కాలువ నీళ్ల ద్వారా చెరువులు, కుంటలు నింపాలని కోరుతున్నారు. దీంతో మత్స్యకారుల కుటుంబాలు జీవనోపాధి పొందుతాయని మత్స్యకారులు పేర్కొంటున్నారు. అలాగే చేప పిల్లలు కొనడానికే ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తున్నదని, ప్రభుత్వం 100 శాతం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకారులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కాలువ నీళ్లతో చెరువులు నింపాలి

సైదాపూర్ మండలంలో 30 గ్రామ పంచాయతీలుండగా 17 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. అందులో 2వేల మంది తమ్మ్యకార సభ్యత్వాలున్నాయి. సుమారు 2వేల పైన కుటుంబాలు చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. అయితే సైదాపూర్ మండలానికి ఒక పక్క నుంచి కాకతీయ కెనాల్ ఉన్నది. కొంత భాగానికి మిడ్ మానేరు కాలువ ఉంది. మరికొన్ని గ్రామాలకు గౌరవెల్లి కాలువ వస్తుంది. ప్రభుత్వం ప్రతి సంవత్సరం కాలువ నీళ్ల సమృద్ధిగా వదిలితే సైదాపూర్ మండలంలో చెరువులు, కుంటలు పూర్తిగా నిండే అవకాశం ఉన్నది. మరోవైపు అన్ని గ్రామాల్లో ప్రతి యేటా ఉచిత చేప పిల్లలను అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.



ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలి

పెసరు కుమారస్వామి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు



ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా కాలువల ద్వారా ఆయా ప్రాంతంతోని చెరువులు, కుంటలు నింపాలి. దీనితో పాటు ఉచిత చేపపిల్లలు పంపిణీ చేయాలి. ప్రతి గ్రామంలో మత్స్యకార కుటుంబాలు చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. చెరువులు, కుంటలు నింపడం వల్ల మత్స్యకారు లకు చేతి నిండా పని దొరికి ఆర్థి కంగా అభివృద్ధి చేందే అవకాశ ముంది. ప్రభుత్వం మత్స్య పారిశ్రామిక సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి నందికమాన్ సమీపంలో గుర్తుతెలియని వృదురాలు మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. నందికమాన్ సమీపంలోని రోడ్డు పక్కన సుమారు 60 సంవత్సరాల వయస్సుగల, పసుపు పచ్చ చీర, ఎరుపు రంగు జాకెట్ కలిగిన వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు గుర్తించమన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేసి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిస్తే వేములవాడ టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

కలప పట్టివేత

కొడిమ్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని దమ్మయ్యపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను అటవీ అధికారులు పట్టుకున్నారు. అటవీ సిబ్బందికి అందిన పక్కా సమాచారం మేరకు సోమవారం రాత్రి అటవీ శాఖ రేంజర్ గులాం మొయినుద్దీన్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి ట్రాక్టర్‌లో తరలిస్తున్న 35వేల రూపాయల విలువైన 44టేకు దుంగలను పట్టుకున్నారు. డిప్యూటీ రేంజర్ ముషీర్ అహ్మద్, దమ్మయ్యపేట బీట్ అధికారి అశ్విణి, బేస్ క్యాంప్ సభ్యులు ఉన్నారు.

బందోబస్తు మధ్య అంత్యక్రియలు

రుద్రంగి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఫుడ్ పాయిజన్‌తో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన కాదాసు పుష్పలత, నిహాల్ తేజ్ అనే తల్లికొడుకుల మృతదేహాలు మంగళవారం రుద్రంగికి చేరుకున్నాయి. దీంతో బంధువులు రోదనలు మిన్నంటాయి. రుద్రంగిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి ఎస్‌ఐ సిరిసిల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ - సిరిసిల్ల జిల్లా కమిటీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి వెంటనే పీఆర్సీని అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదిమూలం వెంకట్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలుగా ట్రెజరీల్లో ఆమోదం పొంది కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్నిబిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. రెండు సంవత్సరాలుగా సెలవు జీతాలు, సప్లమెంటరీ వేతనాలు, మెడికల్‌బిల్లులు జీపీఎఫ్, పెన్షన్ టీఎస్ జీఎల్ఐ తదితర బిల్లులు విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత సంవత్సరం మార్చి నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, కమ్యూనిటేషన్ మొత్తాలను చెల్లించకపోవడం వల్ల పెన్షనర్లు ఇబ్బందులకు గురైతున్నారన్నారు. బకాయి పడిన ఐదు వాయిదాల డీఎలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీవో 317 బాధితులకు న్యాయం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా పాత విధానాన్ని కొనసాగించడం విచారకరమన్నారు. జీవో 317ను సవరించి బాధితుందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దుచేయాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను అమలు చేయాలని, రాష్ట్రంలో అన్ని జిల్లాలకు డీఈవో పోస్టులకు, అన్ని మండలాలకు ఎంఈవోలను నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ దశల వారీగా ఉద్యమ కార్యాచరణను ప్రకటించిందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గోల్కోండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రావు, కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శులు పాములస్వామి, అడేపు శివకుమార్, తిరపతి, కొత్వాల్ ప్రవీణ్, పోలాస మల్లేశం, కోటగిరి లక్ష్మణ్, మధుసూదన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కోరుట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన రంజిత (20) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఏసీగోన్ని గుట్ట ప్రాంతానికి చెందిన రంజిత పట్టణానికి చెందిన పవన్‌ను కొన్ని రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకొని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. మంగళవారం రోజు పవన్ తండ్రి అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో రంజిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి బయటకు రాకపోవడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు ఇంట్లోకి వెళ్లి చూడగా రంజిత ఉరివేసుకొని ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చరీలో భద్రపరిచారు. ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


సంధ్యారాణి (ఫైల్)

జైపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీధ ర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన నడిగొట్టు సంధ్యారాణి(40) కుటుంబీకులతో కలిసి మంచిర్యాలలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వచ్చింది, కారులో తిరిగి ఇంటికి వెళ్తుండగా ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద జైపూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న వాహనం కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన సంధ్యా రాణిని మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. సంధ్యారాణి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యువతిని లైంగికంగా వేధించిన వ్యక్తికి జైలు శిక్ష

కోల్‌సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యువతిని కులం పేరుతో దూషించి లైంగికంగా వేధించిన కేసులో గోదావరిఖని రాజీవ్‌నగర్‌కు చెందిన ఆవుల మల్లయ్యకు మంగళవారం కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. 2017లో అడ్డగుంటపల్లిలో ఈ ఘటన జరిగిందన్నారు. ఈ కేసు కరీంనగర్‌లోని ఎస్‌సీ, ఎస్‌టీ కోర్టులో విచారణ జరుగగా గోదావరిఖని కోర్టు ఏఎస్‌ఐ తిరుపతిరావు, కానిస్టేబుల్ మహేందర్ సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారు. బాధితురాలి తరఫున ప్రభుత్వ న్యాయవాది రాములు నేరం నిరూపించారన్నారు. న్యాయమూర్తి నీరజ తీర్పు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. దోషికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బంది, పీపీ రాములును సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ పుల్లా కరుణాకర్, ఏసీపీ రమేష్ అభినందించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఉపాధిహామీ కూలీలపై తేనెటీగల దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

మంథనిరూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజు లపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో కాలువ పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలపై మంగళవారం ఉదయం తేనెటీగలు దాడి చేశాయి. కాలువ పూడికతీతలో భాగంగా చెట్లను తొలగిస్తుండగా చెట్లపై ఉన్న తేనే తీగలు ఒక్కసారిగా లేచాయి. కూలీలు అక్కడి నుంచి వెళ్లిపోవటానికి ప్రయత్నిస్తుండగా అవి ఒక్కసారిగా దాడి చేయడంతో 11 మంది కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటనలో పేరం దుర్గయ్య, గంగుల స్వామి, తోగరి మల్లయ్య, వేల్పుల రాయలింగు, పేరం లక్ష్మి, నలోటి లక్ష్మి, తోగరి గౌరమ్మ, వేల్పుల లక్ష్మి, వేల్పుల బాను, గోస్కి ఎల్లమ్మ అనే కూలీలకు గాయాలయ్యాయి. వీరిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. గాయపడిన ఉపాధిహామీ కూలీలను ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేష్, ఆర్ల సందీప్, గొర్కెల సురేష్, మంథని లింగయ్యలు పరామర్శించారు. గాయపడ్డ కూలీలకు మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను వారు కోరారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

బీర్‌పూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యా యత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందిందని ఎస్సై కుమారస్వామి తెలిపారు. బీర్‌పూర్ మండలం రేకులపల్లి గ్రామానికి చెందిన పసుల గంగవ్వ(26)కు రెండు సంవత్సరాల క్రితం తన బావ అయిన తాటిపల్లి మహేందర్‌తో రెండో వివాహం జరిగింది. వివాహం జరిగిన కొన్ని రోజుల తరువాత జీవనోపాధి నిమిత్తం ముంబాయికి వెళ్లారు. అక్కడ గంగవ్వ కడుపు నొప్పితో బాధపడడంతో స్వగ్రామానికి వచ్చింది.

అయినా నయం కాకపోవడంతో గత నెల 21న క్రిమిసం హారక మందు తాగింది. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ గంగవ్వ మృతి చెందింది. మృతురాలు గంగవ్వ తండ్రి లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు కలెక్టర్ చేయూత


క్షతగాత్రుడితో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రెండో బైపాస్ రోడ్డులో మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరికి కలెక్టర్ చేయూత నందించారు. గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. చంద్రంపేట శివారులోని రెండో బైపాస్ రోడ్డు జంక్షన్‌లో బైక్, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యు వకులు గాయపడ్డారు. అదే సమయంలో అధి కార పర్యటన నిమిత్తం వెళ్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంఘటనను చూసి తన వాహనాన్ని ఆపారు. గాయపడ్డ యువకులను పరామర్శించి అంబులెన్స్‌లకు సమాచారం అందించి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుడుంబాను ద్విచక్రవాహనంపై తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల-మరిమడ్ల రహదారిపై తనిఖీలు భాగంగా ఓ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 10 లీటర్ల నాటుసారా లభించిందన్నారు. సారాను, రవాణాకు వాడిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకొని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కాంగ్రెస్ జెండా గద్దె ధ్వంసం


జెండా గద్దెను పరిశీలిస్తున్న పోలీసులు

కోనరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెను సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. కాగా కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టిమల్ల చేరుకొని ధ్వంసమైన కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెను పరిశీలించి సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నామని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

చెంజర్లలో పూరిల్లు దగ్ధం

- కాలిబూడిదైన రూ. 1.50 లక్షలు, సామగ్రి

మానకొండూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెందజర్లలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఓ పూరిల్లు మంగళవారం దగ్ధమైంది. చెంజర్ల గ్రామానికి చెందిన గొల్లెన జ్యోతి-అశోక్ దంపతులకు ఇద్దరు కుమారులు చరణ్, అరవింద్ ఉన్నారు. జ్యోతి, అశోక్ గ్రామంలోని ఓ ప్రయివేటు కంపెనీలో పని చేస్తు ఇద్దరు పిల్లలను సాకుతున్నారు. మంగళవారం ఉదయం ఇంటిలో పూజ చేసి దీపం ముట్టించి ఎప్పటిలాగే పనులకు వెళ్లగా కుమారులు పాఠశాలకు వెళ్లారు. వారు వెళ్లిన కొద్ది సేపటికే ముట్టించిన దీపం సమీపంలోని బట్టలకు అంటుకొని పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. నూతన ఇంటి నిర్మాణానికి 1.50 లక్షల రూపాయలను అప్పు తెచ్చి బీరువాలో దాచాగా ప్రమాదంలో బీరువాలోని బట్టలతో పాటు నగదు, 50 కిలోల బియ్యం, వంట సామగ్రి, రెండు మంచాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి.

సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాములు, రికార్డు అసిస్టెంట్ బాబుదేవ్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పూరిల్లు దగ్ధం కావడంతో రోడ్డున పడ్డామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత దంపతులు కోరారు.


దగ్ధమైన పూరిల్లు వద్ద బాధితులు

ఇస్రో యువికాకు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

ఒకే పాఠశాల నుంచి ఇద్దరు



పి.సాత్విక, పి.సిరివెన్నెల, టి.సాయిహర్షిత

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ యేటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యువ శాస్త్రవేత్త కార్యక్రమానికి జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి మంగళవారం తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాగినేడుకు చెందిన భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు కె.జగదీశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో పోలవేణి సాత్విక, పడాల సిరివెన్నెల, పాలకుర్తి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కన్నాలకు చెందిన భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు బి.రవీనందన్‌రావు మార్గదర్శనంలో తోడేటి సాయిహర్షిత ఎంపికయ్యారు. గతనెలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా ముగ్గురు యువికా 2025కు ఎంపికైనట్లు డీఈఓ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 28రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి వేలాది మంది 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు గత నెల 23వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారు. రాష్ట్రం నుంచి ఈసారి 12మంది విద్యార్థులు ఎంపిక కాగా ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన ముగ్గురు పెద్దపల్లి జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. గతేడాది రాగినేడు ఉన్నత పాఠశాలకు చెందిన రంగు కీర్తన ఎంపిక కాగా ఈసారి అదే పాఠశాల నుంచి ఒకే తరగతికి చెందిన ఇరువురు ఎంపికయ్యారు. ముగ్గురు విద్యార్థులు మే నెలలో ఇస్రోకు చెందిన 7పరిశోధన కేంద్రాల్లో ఒకచోట అంతరిక్ష సాంకేతికత, అనువర్తనాలపై రెండువారాల ఆవాస శిక్షణా కార్యక్రమంలో పాల్గొనున్నట్లు డీఈవో తెలిపారు. జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థినులు శిక్షణకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఎంపికైన విద్యార్థినులను, గైడ్ టీచర్లను డీఈవో డి.మాధవితో పాటు డీఎస్‌ఓ సమగ్ర శిక్ష సమన్వయకర్తలు పిఎం.షేక్, సీహెచ్ మల్లేష్‌గౌడ్, కవిత, అజీం, మండల విద్యాధికారులు టి.సురేంద్రకుమార్, టి.విమల, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ ఆగయ్య, జె.కమలాకర్‌రావు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు.

సైనిక్ స్కూల్‌లో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ ఎగ్జిబిషన్



స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్ బస్ వద్ద విద్యార్థులు

చొప్పదండి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ సైనిక స్కూల్‌లో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ బస్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. జిల్లాలో మొట్ట మొదటిసారిగా రుక్మాపూర్ సైనిక్ గురుకుల స్కూల్‌లో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతరిక్ష విజ్ఞానాన్ని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్న లక్ష్యంతో ఎన్‌ఆర్‌ఎస్‌సీ సంస్థ స్పేస్ ఆన్ వీల్స్‌ను నిర్వహిస్తున్నారు. అంతరిక్ష విద్య, దాని అనుభవాలను సందర్శించడానికి తక్కువ అవకాశాలు ఉన్న గ్రామీణ పిల్లలకు అందించడం ఎగ్జిబిషన్ లక్ష్యం. ఈ ప్రత్యేక వాహనంలో ఉపగ్రహ నమూనాలు, లాంచ్ వెహికిల్స్ భారత అంతరిక్ష ప్రయోగాల విజయాలు, భవిష్యత్తు ప్రాజెక్టుల వివరాలు, అంతరిక్ష విజ్ఞాన సంబంధిత వీడియోలను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఎస్‌సీ సైంటిస్టులు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, డాక్టర్ టి శంకర్ ప్రసాద్, స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీరామారావు,ప్రిన్సిపాల్ కాళహస్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులు ఇవ్వండి


కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత కార్మికుడు, సామాజిక కార్యకర్త అలువాల రాములు కోరారు. కొత్త రేషన్‌కార్డు ఇవ్వాలని సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు నుంచి కరీంనగర్ కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. దారి పొడవునా ఆలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్‌కార్డులు జారీ చేసేలా చూడాలని దేవుళ్లకు మొక్కారు. మంగళవారం కరీంనగర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాములు కొత్త రేషన్‌కార్డు కోసం అనేక సార్లు దరఖాస్తు చేసుకొని విసిగిపోయాడు. తన మాదిరిగా ఎంతో మంది రేషన్‌కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోలేక పోతున్నారని, కార్డులు వెంటనే జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరేందుకు పాదయాత్ర చేపట్టానని తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు ఇప్పించి, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని కోరారు.

10న ఉమ్మడి జిల్లా అండర్-19 బాక్సింగ్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-19 మెన్ అండ్ ఉమెన్స్ బాక్సింగ్ ఎంపి క పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల బాక్సింగ్ క్రీడాకారులు ఉదయం 10 గంటలకు స్టేడియంలో ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఒక పాస్ పోర్టు ఫొటోతో హాజరు కావాలని, వివరాలకు 9100668474 నంబరులో సంప్రదించాలని ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీ సంపత్ కుమార్ తెలిపారు.

అందుబాటులోకి ఎల్‌సీ యాప్

లైన్ క్లియర్ అనుమతి నుంచి రిటర్న్ వరకు యాప్‌లోనే



గణేశ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఎన్పీడీసీఎల్ మరో యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆన్‌లైన్ ఎల్‌సీ (లైన్ క్లియర్) యాప్‌ను ప్రవేశ పెట్టింది. ఎల్‌సీ తీసుకుని పని చేసే సమయంలో మానవ తప్పిదాలు జరుగుతున్న నేపథ్యంలో నూతనంగా తీసుకొచ్చిన యాప్ వినియోగదారులకు.. ఇటు ఎన్‌పీడీసీఎల్ సిబ్బందికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. విద్యుత్ సరఫరాలో భద్రతా ప్రమాణాలను పెంచేందుకు, విద్యుత్ అంతరాయ సమయాలు, మానవ తప్పిదాలను నివారించేందుకు లైన్ క్లియర్ (ఎల్‌సీ) యాప్‌ను రూపొందించామని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ మేక రమేష్‌బాబు తెలిపారు.


యాప్ పని చేసే విధానం

విద్యుత్ సరఫరాలో ఎల్సీ తీసుకోవాలనుకున్న లైన్‌మన్ మొదట లైన్ క్లియర్ యాప్ ఓపెన్ చేయాలి. సంబంధిత ఫీడర్లో ఎల్‌సీ కావాలని ఏఈకి మెసేజ్ చేయాలి. ఏఈ లైన్‌మన్ పంపిన మెసేజ్‌ను పరిశీలించి ఆ ఫీడర్లో ఎల్‌సీ ఇవ్వొచ్చా.. లేదా అని, అత్యవసర అవసరాలు ఏమైనా ఉన్నాయా లేదా మరే ఇతర షెడ్యూల్ చేసిన పనులు ఉన్నాయా అని సమీక్షిస్తారు. దాని ప్రకారం ఎల్‌సీ ఇవ్వొచ్చు లేదా నిరాకరించవచ్చు.. ఏఈ ఎల్‌సీ అనుమతి ఇవ్వగానే సంబంధిత లైన్‌మన్‌కు సమాచారం అందుతుంది. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఏ ఫీడర్‌కు ఎల్సీ ఇవ్వాలో యాప్ ద్వారా మెసేజ్ వస్తుంది.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఎల్‌సీ ఇవ్వాల్సిన సమయంలో పొరపాట్లు లేకుండా తగిన సూచనలు, జాగ్రత్తలు హెల్మెట్ పెట్టుకోవడం, హ్యాండ్ గ్లౌజ్ వేసుకోవడం, ఎర్త్‌రాడ్ వాడాలని, ఏబీ స్విచ్ ఓపెన్ చేస్తారా లేదా అని యాప్ గుర్తుచేస్తుంది. వీటన్నింటిని సబ్‌స్టేషన్ ఆపరేటర్ చేసి ఫొటో తీసి యాప్ అప్లోడ్ చేస్తే ఆ ఫొటోను యాప్ ద్వారా లైన్‌మన్ చూసి.. ఆ ఫొటోలో కనిపిస్తున్న ఫీడర్, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా.. లేదా.. అని ధ్రువీకరించుకుని పని ప్రారంభిస్తాడు. లైన్‌మన్ ఎంతమంది సిబ్బందితో పని చేయిస్తున్నాడో వారి పేర్లు యాప్‌లో పొందుపర్చాలి. పని పూర్తి కాగానే ఈ పనికి సంబంధించి ఫొటో, సిబ్బంది వచ్చారా.. లేదా అని యాప్‌లో పొందుపర్చి ఎల్‌సీని రిటర్న్ చేయాలి. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు యాప్ ద్వారా ఎల్‌సీ రిటర్న్ చేయాలని ఆదేశాలు వెళ్తాయి. రిటర్న్ చేసిన ఎల్‌సీ సమాచారం ఏఈకి అందుతుంది. ఏఈ ఆదేశాల మేరకు ఆ ఫీడర్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు.

ప్రమాదాల నివారణ

విద్యుత్ లైన్ క్లియర్‌లో ఒక ఫీడర్ బదులు మరో ఫీడర్ను ఎంచుకోవడం, పంపిణీ వ్యవస్థ సరిగ్గా గుర్తు చేసుకోకపోవడం, సమాచార లోపం, తదితర కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది, ప్రైవేట్ ఎలక్ట్రిషియన్లు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి నివారణ కోసం ఆన్‌లైన్ ఎల్‌సీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. యాప్ ద్వారా మానవ తప్పిదాలను పూర్తిగా నివారించొచ్చు. అనవసరమైన ఎల్‌సీలు తగ్గించొచ్చు. ఎల్‌సీల సమయాలను గణనీయంగా తగ్గించడమే కాకుండా ఎల్‌సీ తీసుకున్న సమాచారం పైఅధికారులకు వెంటనే తెలిసి పోతుంది. సంబంధిత ఏఈ అనుమతి లేకుండా తీసుకునే ఎల్‌సీలను ఈ యాప్ ద్వారా నివారించొచ్చు.



కాంగ్రెస్‌తో కలిసి పనిచేయకూడదా?

జీవన్‌రెడ్డి టీడీపీ నుంచి వచ్చిన వలస నాయకుడే

అసహనపు మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేయకూడదా అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి టీడీపీ నుంచి కాంగ్రెస్‌కు వచ్చిన వలస నాయకుడేనని, తనపై చేసిన అసహనపు మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో మంగళవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విలేకర్లతో మాట్లాడారు. తనపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఘాటుగా స్పందించారు. ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని తాను కాంగ్రెస్‌లో చేరి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని అన్నారు.

సోమవారం సారంగాపూర్ మండలంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాధికారం కోసమే కాంగ్రెస్ ముసుగులో బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని పరోక్షంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను విమర్శించారు. దీనిపై సంజయ్ కుమార్ స్పందిస్తూ తనపై జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి జీవన్‌రెడ్డి ఎంతోమందిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని సంజయ్‌కుమార్ గుర్తుచేశారు. మీరు పార్టీలో చేర్చుకుంటే లేని తప్పు, నేను కాంగ్రెస్‌లో చేరితే ఎలా తప్పు అవు తుందని జీవన్‌రెడ్డిని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రశ్నించారు. జగిత్యాల ప్రజలకు ఎవరు వలస వచ్చిన నాయకుడో తెలుసునని అన్నారు. తాను చేసిన అభివృద్ధితోనే రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందానని ఎమ్మెల్యే అన్నారు. సీనియర్ నాయకుడిగా జీవన్‌రెడ్డిని గౌరవిస్తానని, తన గౌరవాన్ని కాపాడుకుంటే మంచిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు.

ముగ్గురికి జీవిత ఖైదు

కరీంనగర్‌లీగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యువకుడి ఆత్మహత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు, రూ. 2వేల చొప్పున జరిమానా విధిస్తూ కరీంనగర్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నీరజ మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రామగుండం మండలం మల్రిపల్లికి చెందిన గూండా శంకరయ్య తన కూతురును ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడని అదే గ్రామంలోని ఎస్సీ కులానికి చెందిన దొబ్బల పవన్(21)పై కేసు పెట్టాడు. ఆ కేసులో పవన్ జైలుకు వెళ్లి వచ్చాడు. కొన్నాళ్లకు పవన్‌కు వేరే అమ్మాయితో పెళ్లి సంబంధం కుదిరింది. ఈ విషయం తెలిసి 2016 ఆగస్టు 21 మధ్యాహ్నం పవన్ తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్తుండగా గూండా శంకరయ్య, అకినపల్లికి చెందిన మండే శ్రీనివాస్, ఎగ్లాస్పూర్‌కు చెందిన క్యాతం రవీందర్ అడ్డుకున్నారు. బూతులు తిట్టి చనిపో అంటూ అవమానపరిచారు. దీంతో ఇంటికి వచ్చిన పవన్ జరిగిన విషయాన్ని తన తమ్ముడికి చెప్పి రూంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా చనిపోయాడు. ఈ సంఘటనపై పవన్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో రామగుండం పోలీసులు గుండా శంకరయ్య (40), మెండే శ్రీనివాస్(35) క్యాతం రవీందర్(55)పై కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాల పరిశీలించిన న్యాయమూర్తి నిందితులు ముగ్గురికి జీవిత ఖైదు విధించారు.

'రాజన్న' ఆలయ విస్తరణకు శ్రీకారం

- 15న వేములవాడకు ఉన్నత అధికారుల రాక
- సమీక్షించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రిత్వ కార్యదర్శి శైలజ రామయ్యార్



మ్యాపులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రిత్వ కార్యదర్శి శైలజరామయ్యార్

సిరిసిల్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన పనులపై మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధ్యక్షతన దేవాదాయ శాఖ మంత్రిత్వ కార్యదర్శి శైలజరామ య్యార్, ఓఎస్‌డీ సోమరాజులు, కమిషనర్ శ్రీధర్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం విస్తరణ పనులపై చర్చించారు. ఈనెల 15న దేవాదాయ శాఖ కమిషనర్ ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి వేముల వాడలో పర్యటించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయి పర్యటన చేసి మరోసారి శృంగేరీ పీఠం వారి వద్దకు వెళ్లాలని నిర్ణయించారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్కిటెక్‌తో తయారు చేయించిన ఆలయ విస్తరణ పనులకు సంబంధించిన నమూనా లను పరిశీలించి కొన్ని మార్పులుచేర్పులు చేసి రెండు రోజుల్లోగా చివరి ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ శాఖ, దేవాదాయ శాఖ అధికారులతో కమిటీ వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీలోపు పీఠాధిపతి సూచనలు తీసుకొని 21న టెండర్ ప్రక్రియ చేపట్టడానికి ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.



లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

యోగానంద లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

జూలపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ శివారులోని శ్రీయోగానందా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం మంగళవారం గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా ముత్యాల పందిరిని ఏర్పాటుచేసి రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. సన్నాయి మేళతాళాల మధ్య అర్చకులు స్వామి వారల పెళ్లితంతును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి కల్యాణ వేడుకలను చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కల్యాణోత్సవంలో భక్తులు ఆలపించిన గోవింద నామాలు మారుమోగాయి. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం చలువ పందిరి, తాగునీరు, అన్న ప్రసాదం, పలు సౌకర్యాలను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. గొట్టిముక్కుల రజనీ, రవిందర్‌రెడ్డి, గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి, సీపెల్లిగోపాలక్రిష్ణ, సంకెండ్ల లక్ష్మి రాజం, సీపెల్లి అంజి, బొజ్జ సంపత్, మద్దెల నరేష్, కొండపెల్లి క్రిష్ణమూర్తి, గుండు కరుణాకర్, బాలక్రిష్ణ భక్తులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించండి

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్



కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నేతకార్మికుల సమస్యలను పరి ష్కరించాలని తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ కోరారు. ఈ మేరకు ఆయన కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి చేనేత కార్మికుల సమస్యలను వివరించారు. వాటిని పరిష్క రించేందుకు కేంద్ర జౌళిశాఖ మంత్రి అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సంజయ్ చేనేత కార్మికుల సంక్షేమం, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, ఢిల్లీకి వస్తే తప్పకుండా కేంద్రజౌళిశాఖ మంత్రి అపాయింట్‌మెంట్ ఇప్పించి, పరిష్కారానికి సహకరిస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి సాను కూలంగా ఉందని చెప్పినట్లు వీరమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలిగేటి శ్రీనివాస్, మహిళా విభాగం కోశాధికారి భీమనాతి శారద పాల్గొన్నారు.అనంతరం కేంద్రమంత్రి బండి సంజయ్‌ని శాలువతో సత్కరించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్క ర్స్ (ఎస్‌డబ్ల్యుయూ) ఐఎన్‌టీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జక్కుల మల్లేశంగౌడ్ అన్నారు. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీ సమ్మెకు ఇది సరైన సమయం కాదని, సంస్థలోని మిగతా సంఘాలను కలుపుకొని వెళ్లాలని అన్నారు. సమ్మెపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు చొరవ చూపాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కార్మికులకు పీఆర్సీ 21శాతం అందించిందన్నారు. రావాల్సిన బాండ్ డబ్బులతోపాటు, డీఏ అందించారన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దశల వారీగా పరిష్కరిస్తుందన్నారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన పనిభారాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాల న్నారు. బ్రీత్ అనలైజింగ్ టెస్టుల్లో వస్తున్న దానికనుగుణంగా కార్మికులను తొలగిస్తున్నారని, బీపీ, షుగర్ మందులతో బ్రీత్ టెస్టుల్లో పర్సెం టేజీలు అధికంగా వస్తున్న విషయాన్ని గమనించి కార్మికులకు వెసులుబాటు కల్పించాలన్నారు. ఆర్టీసీ లాభాల బాటలో ఉన్నందున మొదటి తేదీన జీతాలు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలపై స్పందించాలని, లేని పక్షంలో సమ్మెపై తమ సంఘం కూడా ఆలోచన చేయాల్సి వస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజు, రీజినల్ సెక్రెటరీ టీఆర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జక్కుల మల్లేశంగౌడ్

కుటుంబ కలహాలతో ముగ్గురికి కత్తిపోట్లు

బాధితుల్లో మూడేళ్ల బాలుడు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో కుటుంబ కలహాలతో ముగ్గురు కత్తిపోట్లకు గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన కళికోట వెంకటేశ్, అతడి అన్న కొడుకు పృథ్వీ మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం వెంకటేశ్ అన్న కొడుకు పృథ్వీ, సాయి, మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కలిసి వెంకటేశ్- ఏంజెల్ దంపతులు, వారి కొడుకు శివనేత్ర(3)లపై కత్తులతో దాడిచేయడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఇందులో శివనేత్ర పరిస్థితి విషమంగా ఉంది. ఏంజెల్‌కు తీవ్ర గాయాలు కాగా, వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో బాలుడు శివనేత్రను హైదరాబాద్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పృథ్వీ, సాయిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. కాగా, గతంలో పృథ్వీ అనే వ్యక్తిపై తాను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితుడు వెంకటేశ్ మీడియా ఎదుట తన బాధను వ్యక్తం చేశాడు. పోలీసులు పట్టించుకుంటే ఈ సంఘటన జరిగేది కాదని వెంకటేశ్ పేర్కొన్నాడు. తనపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు. కాగా, పోలీసులు స్పందించలేదని వెంకటేశ్ పేర్కొనడం అవాస్తమని సీఐ తెలిపారు.



ఆలయ ఆవరణలో భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

వేలాదిగా అంజన్నను దర్శించుకున్న దీక్షాపరులు

మల్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. కాగ హనుమాన్ చిన్న జయంతి సమీపిస్తుండడంతో వేలాదిగా సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న అంజన్న దీక్షాపరులు వేకువజామునే స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చు కున్నారు. ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి.

బద్ది పోచమ్మకు బోనాలు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాడి పంటలు, పిల్లాపాపలను చల్లగా చూడమ్మ బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. వేమువాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ బద్దిపోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవారికి మట్టికుండలో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు.



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

పాత్రికేయుల సమస్యలు పరిష్కరించాలి

-కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) :కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో పాత్రికేయులకు నిర్మాణం చేసిన రెండు పడకల ఇండ్ల అలాట్మెంట్లను అందించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను మంగళవారం కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి స్థానికంగా ఉన్న సమస్యలను వివరించారు. నియోజకవర్గంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు.

బీజేపీ నాయకుల ధర్నా

రాయికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయం, లలితాంబ ఆలయాల్లో ఐదు గోమాతలను కొన్ని రోజుల క్రితం దుండగులు ఎత్తుకెళ్లినా అధికారులు స్పందించడం లేదని మంగళవారం బీజేపీ నాయకులు, శివాజీ రెడ్డి యువజన సంఘం నాయకులు, అఖిలపక్ష నాయకులు శివాజీ విగ్రహం వద్ద ధర్నాకు దిగారు. దొంగచాటుగా ఆవులను ఎత్తుకు వెళ్లి కబేళాలకు తరలిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ధర్నా చేస్తున్న వారితో మాట్లాడారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

రాయికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రానున్న మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి సన్నద్ధం కావాలని బీజేపీ క్రియాశీల సభ్యత్వ కార్యకర్తల సమావేశం రాయికల్ పట్టణంలో నిర్వహించారు. పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సురతాని భాగ్య, నాయకులు మచ్చ నారాయణ, కుర్మ మల్లారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కుంజోజి రవి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నిరంతర పర్యవేక్షణ, ఆరోగ్య సలహాలు పొందడం ద్వారా గర్భిణీలు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ జగిత్యాల అర్బన్ సూపర్‌వైజర్ కవితరాణి అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని స్థానిక జంబిగద్దె అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నీలవేణి, దయావతి, యతీశ్వరీ, రజిని, శివప్రియ, కళావతి, రామలక్ష్మీ, మమత పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

రాయికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన పల్లికొండ లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రవాస భారతీయులు దుబాయ్‌లో వారధి సంఘం ఆధ్వర్యంలో రూ.48,350లు ప్రోగు చేసి మృతుని కుటుంబ సభ్యులకు మంగళవారం అందించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

-అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఈనెల 22 వరకు 'పోషణ్ పక్వాడ'



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం ఎంతో అవసరమని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో గర్భిణులు, పుట్టబోయే బిడ్డ, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాలు కలిగిన ఆహారం అందించడమే కాకుండా ప్రతి సంవత్సరం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఏప్రిల్ 8 నుంచి 22 వరకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కల్పిస్తున్నారు. అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంతో పాటు చిరుధాన్యాల ప్రాముఖ్యత తదితర అంశాలపై సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

● నిర్వహించే కార్యక్రమాలు..

పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్వర్యంలో అంగన్ వాడీ కేంద్రాల ద్వారా గ్రామాల్లో ఆరోగ్యకరమైన అంశాలపై 15 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. చిరుధాన్యాలతో కలిగే లాభాలు, పరిసరాల పరిశుభ్రత, పోషకాహార అవగాహన, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యసం చేయించడంతో పాటు రక్తహీనతతో కలిగే నష్టాలు, కిషోర బాలికలకు అవగాహన సదస్సు తదితర కార్యక్రమాలను గ్రామాల్లో చేపట్టనున్నారు. చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలను అంగన్‌వాడీ కేంద్రాలకు పిలిపించి పౌష్టికాహారం తాయరు చేయాల్సిన విధానంపై అవగాహన కల్పించడం, చేతుల శుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించనున్నారు. వయసుకు తగిన ఎత్తు, బరువు లేని పిల్లలను గుర్తించి వారికి కావాల్సిన ఆహారం తీసుకోవాల్సిన వాటిపై అవగాహన కల్పిస్తున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నాం

-మణెమ్మ, ఐసీడీఎస్ సీడీపీవో

పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి రోజు తీసుకోనే ఆహారంలో చిరుధాన్యాలు, పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలి. పోషకాహారంపై అంగన్‌వాడీ కేంద్రాలద్వారా చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం.

బీఆర్‌ఎస్ రజతోత్సవాలను విజయవంతం చేయాలి



గోడపై పెయింటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో ఈ నెల 17న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో చేపడుతున్న బీఆర్‌ఎస్ రజతోత్సవాలను విజయవంతం చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని యూసుఫ్ నగర్ గ్రామంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వాల్ రైటింగ్ నిర్వహించి ప్రచారం చేట్టారు. గ్రామంలో వాల్ రైటింగ్ చేస్తూ రజతోత్సవ వేడకలో భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, గ్రామ మాజీ సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, నాయకులు అన్వర్, ఫహీం, వినోద్‌లు పాల్గొన్నారు.

పాల కుంట చెరువు నింపాలని రైతుల ఆందోళన



చెరువు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పాల కుంట చెరువు నింపాలని మండలంలోని కల్లూర్ రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. తూము వదిలితే చేపలు పోతాయని గుత్తేదారులు... తూము ఆపితే పండలు ఎండుతాయన్న వాదనతో రైతులు చెరువు వద్ద ఆందోళనకు దిగారు. చెరువును వేలంలో పాడుకొని కాలువ మరమ్మతులు... చెరువు నింపే బాధ్యత తీసుకున్న వ్యక్తిని ఇరు వర్గాల నిలదీశారు. మరమ్మతులు చేసి చెరువు నింపే బాధ్యతతో పాలకుంట చెరువుకు సంబంధించిన హక్కులను గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి రెండు లక్షలకు దక్కించుకున్నాడు. గ్రామ శివారులోని వాగు నుంచి మాటు కాల్వ ద్వారా చెరువును నింపుతుంటారు. సదరు వ్యక్తి నిర్లక్ష్యం చేయడంతో నీటి ఎద్దడి చోటు చేసుకుంది. పాలకుంట చెరువులో సరిపడా నీరు లేకపోవడంతో రైతులు వెంటనే చెరువు నింపి తూము ద్వార నీటిని వదలకపోతే పంటలు ఎండిపోతాయని ఆందోళన చేపట్టారు. కాలువ మరమ్మతులు చేసి నీటిని నింపుతానన్న సదరు మాజీ ప్రజాప్రతినిధి పట్టించుకోకపోవడంతో పాటు చెరువులో చేపలు పట్టడానికి మరో వ్యక్తులకు అప్పగించాడు. అయితే చెరువును దక్కించుకున్న వ్యక్తులు చేపల కోసం తూము వద్ద నీటిని మట్టి పోసి ఆపేసారు. దీంతో చేపల కోసం మాజీ ప్రజాప్రతినిధితో ఒప్పందం చేసుకున్న గుత్తేదారులు చేపలకు నీళ్ల ఉంచాల్సిదేనని పట్టుబడుతుండగా రైతులు తూమును తెరిచి వెంటనే సాగుకు నీరు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. సరైన సమయంలో వాగు నుంచి మాటు కాల్వ ద్వారా చెరువులోకి తరలించకపోవడంతో నీరంతా వృథాగా వాగులోకి వెళ్లి పోయాయని రైతులు ఆరోపించారు. ఇప్పడికైన మాటు కాల్వ మరమ్మతులు చేసి వాగు నీటిని చెరువులో నింపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

బీర్‌పూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన కొంత మందికి మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందిన చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు గుడిసె జితేందర్ యాదవ్ చేతుల మీదుగా రూపాయలు లక్షా 89 వేల విలువ గల చెక్కులను ఆరుగురు లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పూడూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీర హన్‌మాన్ విజయయాత్రను విజయవంతం చేయాలి

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో బుధవారం నిర్వహించనున్న వీర హన్‌మాన్ విజయ యాత్రను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు పోహర్ తుకారం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కాశీబాగ్ హన్‌మాన్ మందిరం నుండి అయ్యప్ప ఆలయం వరకు వీర హన్‌మాన్ విజయ యాత్ర, బైక్ ర్యాలీ సాయంత్రం ఉంటుందన్నారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

ధర్మపురి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గురువారం సాయంత్రం 4 గంటలకు వీర హనుమాన్ శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు కస్తూరి రాజన్న, అల్లం దుర్గప్రసాద్ తెలిపారు. స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద వారు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ శోభాయాత్ర స్థానిక శివాజీ విగ్రహం నుండి భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ప్రారంభమై క్షేత్రంలోని అన్ని వీధుల గుండా తిరిగి హనుమాన్ విగ్రహం వద్ద ముగుస్తుందని ఆయన పేరొన్నారు. ఈ శోభాయాత్రలో పది అడుగుల భారీ విగ్రహంతో నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు.

ఎస్సారెస్పీ నీటి విడుదల నిలిపివేత

(5వ పేజీ తరువాయి)

ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ పథకాలకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కోరుట్ల, జగిత్యాల ప్రాంతాలకు 61 క్యూసెక్కులు, ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు 63 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలకు 107 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇదే విధంగా వచ్చే జూలై మాసాంతం వరకు తాగునీటిని అందించడానికి అనుగుణంగా శ్రీరాంసాగర్‌లో నీటి నిల్వలను ఉంచుతున్నారు.

● జిల్లాలో 3.5 లక్షల ఎకరాల సాగు

జిల్లాలో యాసంగి సీజన్‌లో సుమారు 3.5 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. జిల్లాలో ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. ఇబ్రహీంపట్నం మండలం నుంచి పెగడపల్లి మండలం వరకు సుమారు 91 కిలో మీటర్ల మేర కాకతీయ కాలువ ప్రవహిస్తోంది. ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు విడుదల చేస్తున్న నీరు 25వ కిలో మీటరు వద్ద జగిత్యాల జిల్లాలో ప్రవహిస్తోంది. 116వ కిలోమీటరు వద్ద ముగుస్తోంది. జిల్లాలోని వివిధ గ్రామాలకు కాకతీయ కాలువకు అనుబంధంగా ఉప కాలువలను నిర్మించి నీరు సరఫరా చేశారు. జిల్లాలో డీ-21 ఉప కాలువ నుంచి డీ-83 వరకు 62 డిస్ట్రిబ్యూటర్ కాలువలు ఉన్నాయి. ఒక్కో డిస్ట్రిబ్యూటరీకి ఆయకట్టును బట్టి ఎడమ, కుడి వైపులకు మరో 50 వరకు కాలువలు ఉంటాయి. సంబంధిత మైనర్ కాలువల ద్వారా సాగునీరు పంట పొలాలకు అందించారు. జిల్లాలో ఎస్సారెస్పీ ద్వారా 1.70 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించారన్న అంచనా ఉంది.

'అంబేద్కర్ భావజాలాన్ని వ్యాప్తి చేయాలి'



భీమ్ దీక్ష స్వీకరిస్తున్న చిర్ర దిలీప్

గొల్లపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీ.ఆర్. అంబేద్కర్ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి నక్క విజయ్ కుమార్ అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రానికి చెందిన యువ న్యాయవాది, అంబేద్కరిస్ట్ చిర్ర దిలీప్ అంబేద్కర్ విగ్రహం వద్ద భీమ్ దీక్షను స్వీకరించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలోని బహుజనుల బతుకులు మార్చిన మహోన్నత శక్తి అంబేద్కర్ అని అన్నారు. కార్యక్రమంలో బహుజన సంఘాల నాయకులు ఆవుల సత్తయ్య, నల్ల శ్యామ్, చౌట్‌పెల్లి తిరుపతి, గురిజల బుచ్చిరెడ్డి, కలికోట సత్య, మాజీ సర్పంచ్‌లు బొల్లె గంగారాం, చిర్ర గంగాధర్, నాయకులు కోమురయ్య, జాకబు, శ్రీనివాస్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీర హనుమాన్ విజయోత్సవ ర్యాలీ

కోరుట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణ భజరంగ్‌దళ్, సనాతన ధర్మ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వీర హనుమాన్ విజయోత్సవ ర్యాలీ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర దేవలయంలో ప్రత్యేక పూజలను హనుమాన్ దీక్షాపరులతో నిర్వహించారు. వేంకటేశ్వర దేవాలయ ఆవరణలో వేదపండితులు ప్రత్యేక పూజలను నిర్వహించంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురిబి నవీన్‌లు జెండా ఉపి ర్యాలీని ప్రారంభించారు.

ర్యాలీలో శ్రీరాముడి విగ్రహంతో ఆంజనేయ స్వామి విగ్రహాలను ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. ర్యాలీ గాంధీ రోడ్డు మీదుగా కార్గిల్, నంది, అంబేద్కర్, డైమండ్ చౌరస్తా, కాల్వగడ్డ నుంచి వేంకటేశ్వర దేవాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా హనుమాన్ దీక్ష పరులు శ్రీరామ నామస్మరణతో పట్టణం మరుమోగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్, ఎబివిపి, హనుమాన్ దీక్ష పరలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ఫేర్‌వెల్‌డే హంగామా



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థుల ఫేర్‌వెల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విద్యాసంస్థల అధినేత డా.నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలరు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

బీర్‌పూర్,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో లచ్చాలు అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలంలోని కండ్లపెల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు విషయంలో కొంతకాలంగా జరుగుతున్న వివాదంపై గ్రామ ప్రజలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ముతాజుద్దిన్, ఎంపీడీవో లచ్చాలు, ఎస్సై కుమార స్వామి, ఆర్ఐ రాహుల్, గ్రామ ప్రత్యేకధికారి వషీమ్, కార్యదర్శి సురేష్‌లు గ్రామ ప్రజలను, అంబేద్కర్ సంఘ నాయకులను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సమకూర్చి ఇరువర్గాలకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టాలంటే కచ్చితంగా కలెక్టర్ అనుమతులు అవసరమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పర్వతం రమేష్, దోసారపు జెగున శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం నాయకులు ఎం ఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దుమాల గంగారాం, నాయకులు బెజ్జెంకి సతీష్, సంగేపు ముత్తు, బోనగిరి కిషన్, పోడెటి సునీల్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

యంగ్ సైంటిస్ట్ కార్యక్రమానికి ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎంపిక



ఎంపికైన అశ్విని

కొడిమ్యాల, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) నిర్వహిస్తున్న యువిక-2025 యంగ్ సైంటిస్ట్ కార్యక్రమానికి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కొలకాని అశ్విని ఎంపికైంది. దేశ వ్యాప్తంగా ఇస్రోకు చెందిన 8పరిశోధన కేంద్రాలలో ఎంపికైన విద్యార్థులకు మే నెలలో 12 రోజుల పాటు అంతరిక్ష విజ్ఞానానికి సంబంధించిన శిక్షణ ఇవ్వనున్నారు.

తెలంగాణలో 12 మంది ఎంపిక కాగా ఇందులో హైదరాబాదులోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో నిర్వహించు శిక్షణకు అశ్విని ఎంపిక కావటం పట్ల ప్రిన్సిపాల్ బి. లావణ్య, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

'అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి'



ప్రతిజ్ఞ చేయిస్తున్న కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయ సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. మంగళవారం మండలంలోని అమ్మక్కపేట గ్రామంలో కాంగ్రెస్ నాయ కులతో కలిసి జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని జువ్వాడి నర్సింగరావు ప్రచారం ప్రారంభించి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్, మహత్మ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో నిమ్న వర్గాల సంక్షేమం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, కాంగ్రెస్ నాయకులు కాశీరెడ్డి బాష్కర్‌రెడ్డి, పోనకంటి చిన్న వెంకట్, దూదిగం గంగాధర్, పెంట లింబాద్రి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి కాంగ్రెస్‌లో చేరికలు

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయ కులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి యరగొర్ల బాల చిన్నయ్య బీజేపీ పార్టీకి రాజీనామా చేసి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జువ్వాడి నర్సింగరావు బాల చిన్నయ్యకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్, మెట్‌పల్లి మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి సమస్యలు పరిష్కరించాలని వినతి

కొడిమ్యాల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు గ్రామ నాయకులు పలు వినతి పత్రాలు అందించారు. మండల కేంద్రంలోని విశ్వబ్రాహ్మణుల కర్ర పని సంఘ భవనం మిగులు పనికి నిధులు, బ్రహ్మంగారి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. బస్టాండ్ సమీపంలోని చిలుక వాగు సైడ్ వాల్ నిర్మాణానికి, పోచమ్మ ఆలయం నిర్మాణానికి, అంబేద్కర్ సంఘం భవన నిర్మాణానికి, నిధులు మంజూరు చేయాలని అంబేద్కర్ సంఘం నాయకులు వినతి పత్రం అందించారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ

మెట్‌పల్లిటౌన్/రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవయసాయ మార్కెట్ యార్డులో మంగళవారం రైతులకు, హమాలీ, చాటా కార్మికులకు మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో పని చేసే కార్మికులు ఎండలో నిరసించి పోకుండా ప్రతి ఒక్కరికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఇంద్రసేన రెడ్డి, పర్యవేక్షకులు హరికృష్ణ, హమాలి అధ్యక్షులు రాజయ్య, చాటా అధ్యక్షులు అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే సన్న బియ్యం పంపిణీ

పెగడపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం ముమ్మాటికి కేంద్రానివేనని బీజేపీ పెగడపల్లి మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని నామాపూర్‌లో మంగళవారం సన్న బియ్యం పంపిణీని బిజెపి మండల నాయకులతో కలసి మోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ కిలో రూ. 40 వెచ్చిస్తూ గత ఐదు సంవత్సరాలుగా దేశంలోని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలందరికి కేంద్రం ఉచిత బియ్యం అందిస్తుంటే , రవాణా తదితరాలకు ఖర్చు భరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తామే బియ్యం ఇస్తున్నామనడం విడ్డూరంగా ఉందన్నారు.

కార్యక్రమంలో నాయకులు రవీందర్ రెడ్డి, సాయినాథ్ రెడ్డి, కొమురెల్లి, రజిత తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో విప్ ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వేదపండితులు, అర్చకులు ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చ రణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచార్యా, నంబి నరసింహమూర్తి ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. అలాగే ఆయనకు స్వామి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నవీన్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి చేయూత

కథలాపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారిపేటకు చెందిన కుకునూరి గంగనర్సయ్య అనే వ్యక్తి కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ పేషెంట్‌గా మారగా అదే గ్రామానికి చెందిన ఖతార్ వలస జీవులు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. చికిత్స చేయించుకోలేని దీన స్థితిలో ఉన్న బాధితుడికి రు. 76,700లు సాయం చేశారు. బాధితునికి దాతలు సాయం అందించాలని ఖతార్ మిత్రులు కోరారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

భీమారం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంగళవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. మండల అధ్యక్షుడు సింగిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ఒడ్యాడ్, రాగోజీపేట, కమ్మరిపేట, రంగాపూర్ గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కథలాపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పాముకాటు, విద్యుదాఘాతం, పిడుగు పాటుకు గురై మృతి చెందిన గొర్రెల కాపరులకు రు. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని యాదవ సంఘం అడహాక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ డిమాండ్ చేశారు మండలంలోని దుంపెటలో యాదవ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. గొర్రెల కాపరులు గొర్రెలను మేపుతుండగా ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలన్నారు. సంఘాల బలోపేతం, జనాభా దామాషా ప్రకారం యాదవులకు దక్కాల్సిన హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. దుంపెటలో 37 మందిని సభ్యత్వం చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మ్యాదరవేని రామాంజనేయులు, జెల్ల వేణు, రాచర్ల రవి, బర్ల మధు, బైర భూమేశ్, తొట్ల అంజయ్య, మహేశ్, స్వామి తదితరులు ఉన్నారు.